
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 5 డిసెంబర్ 2024
5
తిరుపతి



డిసెంబర్‌లోనే చంద్రయాన్-4

నేటి సాయంత్రం 4.12కు పిఎస్ఎల్వి సి-59

ప్రజాశక్తి-సూళ్లూరుపేట



డిసెంబర్‌నెలలోనే చంద్రయాన్ -4 ప్రయోగానికి సన్నాహాలు చేస్తున్నామని, గగన్‌యాన్ రాకెట్ ప్రయోగ ఏర్పాట్లు ఇస్రో హెడ్ క్వార్టర్స్‌లో పనులు ప్రారంభం అవుతాయని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. ప్రోబో -3 ఉపగ్రహంలో సాంకేతిక లోపాన్ని కౌంట్‌డౌన్ సందర్భంగా గుర్తించడంతో బుధవారం సాయంత్రం 4.08 గంటలకు ప్రయోగించాల్సిన రాకెట్ ప్రయోగాన్ని, గురువారం సాయంత్రం 4.12 గంటలకు వాయిదా వేశారు.



ప్రవీణ్ వైపు ఎస్సీవీ
చెంచయ్యకే బొజ్జల
జనసేన సైతం....



టీ(ట్వి)స్ట్

ఛైర్మన్ పదవికి 'కూటమి' ఫీట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ప్రసిద్ధిగాంచిన శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పదవిలో ఊహించని ట్విస్ట్ ఏర్పడింది. టిడిపి సీనియర్ నేత, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన రంగినేని చెంచయ్య నాయుడుకే ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పదవంటూ టిడిపి వర్గాలు పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి సత్ర వాడ ప్రవీణ్ పేరును తెరపైకి తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎమ్మెల్యే సత్ర వాడ మునిరామయ్య కుమారుడైన సత్రవాడ ప్రవీణ్ యువకుడు, విద్యావంతుడు, ప్రతిభావంతుడు. గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు పనిచేశాడు.. ఆయనకు ముక్కంటి ట్రస్ట్ ఛైర్మన్ భాగ్యం కల్పించాలంటూ మాజీ ఎమ్మెల్యే ఎస్వీవి నాయుడు స్వయంగా చంద్రబాబుకు చెప్పడంతో కథ మలుపు తిరిగినట్లు అయ్యింది. ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ రేసులో ఇప్పటివరకు నలుగురు పోటీ పడుతున్నారు. వీరిలో సీనియర్ కేటగిరిలో ఏర్పేడు మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ నైనారు పొన్నారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు రెడ్డివారి గురవారెడ్డి, గుమ్మడిపూడి దశరథాచారి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడులు ఉన్నారు. అయితే వీరిలో చెంచయ్య నాయుడుకే ఎమ్మెల్యే ఓటని అంతటా ప్రచారం జరిగింది. అందుకునుగుణంగానే చెంచనాయుడు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తో పాటు పలువురు మంత్రులనూ కలవడం ఆ ప్రచారానికి బలాన్ని చేకూర్చింది. అయితే ఇన్నాళ్లు మౌనంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఒక్కసారిగా తెరపైకి రావడంతో ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ అంశం రసకందాయకంగా మారింది. ఇంకోపక్క జనసేన పేరును కూడా పరిశీలించాలంటూ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఇన్చార్జి కోటా వినుత, చంద్రబాబు దంపతులు గత నాలుగు రోజులుగా విజయవాడలో మకాం వేసి రాష్ట్ర మంత్రులను వరుసగా కలుస్తున్నారు. బుధవారం వినుత దంపతులు మంత్రి నాదెండ్ల మనోహర్ ను కలిశారు. ఈ నేపథ్యంలో ఎవరి విన్నపాన్ని మన్నించి ఎవరికి ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ పదవిని ప్రకటించనున్నారో..! వేచి చూడాలి మరి.

తిరుమలలో అనధికార హాకర్లపై వేటు

టీటీడీ ఛైర్మన్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో అనధికార హాకర్లను తొలగించాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు ఆదేశించారు. బుధవారం వరాహస్వామి అతిథిగహం వద్ద దుకాణాలు, హాకర్ లైసెన్సులను పరిశీలించారు. హాకర్ల వ్యవహారంలో పలు ఫిర్యాదులు రావడంతో నేరుగా టిటిడి ఛైర్మన్ రంగం లోకి దిగారు. తిరుమల అందాలను చెడగొట్టేలా ఇష్టానుసారం ఆక్రమణలు గుర్తించిన ఛైర్మన్ అనధికార హాకర్లను వెంటనే తొలగించాలని రెవెన్యూ అధికారులను అదేశించారు. టీటీడీ నిభందనలకు లోబడి వ్యాపారాలు చేసుకోవాలని, నిభందనలు అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరిక జారీచేశారు. లైసెన్స్ ప్రకారం కేటాయించిన స్థలంలో కాకుండా భక్తులకు ఇబ్బంది కలిగించేలా వ్యాపారాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తిరుమలలో షాపులను పరిశీలిస్తున్న టిటిడి ఛైర్మన్

అమ్మవారి 'పంచమి'కి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన డిసెంబరు 6వ తేదీన జరగనున్న పంచమి తీర్థానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు చెప్పారు. అలిపిరి నుండి శ్రీవారి సారె ఊరేగింపు మార్గాన్ని ఈవో, టిటిడి జేఈవో వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు తదితర ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పంచమి తీర్థం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నుండి సారె ఊరేగింపుగా అలిపిరి చేరుకుంటుందన్నారు. అలిపిరి నుండి అమ్మవారి ఆలయానికి తీసుకుని వచ్చి పూజలు నిర్వహిస్తామన్నారు. తరువాత పంచమి తీర్థ మండపానికి వేంచేసి అమ్మవారికి అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచమి తీర్థం నిర్వహణకు అవసరమైన ఇంజినీరింగ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులు వేచి ఉండేందుకు నాలుగు ప్రాంతాలలో షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి నుండి తిరుచానూరుకు వచ్చే మార్గంలో అయ్యప్ప స్వామి గుడి వద్ద, జడ్పీ హైస్కూలు, పూడి రోడ్డులో, తిరుచానూరు రోడ్లలో ఏర్పాటుచేసిన క్యూలైన్లలో భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు. భక్తులు వేచి ఉండటానికి ఏర్పాటు చేసిన షెడ్లలో అన్నప్రసాదం, అల్పాహారం, బాదంపాలు, తాగునీరు అందిస్తామన్నారు. మహిళలకు పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పద్మపుష్కరిణిలో ఉదయం 12 గంటలకు చక్రస్నానం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. పంచమి తీర్థం ప్రభావం రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనంతో వ్యవహరించి పుణ్యస్నానాలు ఆచరించాలన్నారు. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడుతూ, ప్రతి భక్తుడికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా 1200 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఏ అండ్ సిఏఓ బాలాజీ, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్ పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ప్రసంగిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేపటినుంచి రెవెన్యూ సదస్సులు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 6 నుంచి జనవరి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు జరగనున్నాయని, భూ సమస్యల పరిష్కారం కొరకు ఈ వేదికను వినియోగించి సత్ఫలితాలు సాధించాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్.ఎస్ పేర్కొన్నారు. బుధవారం రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు అనగాని సత్యప్రసాద్ సంబంధిత కార్యదర్శి, సిసిఎల్ఎ కమిషనర్ తదితరులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ సదస్సుల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి జెసి శుభం బన్సల్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల యొక్క రెవెన్యూ గ్రీవెన్స్ లను నాణ్యతగా పరిష్కరించి వాటిని జీరో స్థాయికి తీసుకురావడానికి రెవెన్యూ సదస్సులు ఒక వేదికగా వినియోగించుకోవాలని, రెవెన్యూ సంబంధిత సమస్యలతో తమ అర్జీల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను పదేపదే ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిప్పించుకోవద్దని సూచిస్తూ దిశా నిర్దేశం చేశారు. పీజీఆర్ఎస్ గ్రీవెన్స్ లలో సుమారు 55 శాతం రెవెన్యూ సమస్యలు ఉంటున్నాయని, వాటి పరిష్కారానికి ఈ రెవెన్యూ సదస్సులు వేదిక చక్కగా ఉపయోగపడుతుందని, జిల్లాలోని 1051 రెవెన్యూ గ్రామాలలో నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సుల సందర్భంగా స్వీకరించే ఫిర్యాదులన్నిటినీ రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ రూపొందించిన గ్రీవెన్స్ రిడ్రెసల్ పోర్టల్లోని ప్రత్యేక విండోలో ఆన్‌లైన్లో నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, ఎస్డిసి లు దేవేందర్ రెడ్డి వర్చువల్ గా గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, రెవెన్యూ డివిజనల్ అధికారులు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, కలెక్టరేట్ ఎ.ఓ భారతి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఏరియా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించి, రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు అన్ని ఏరియా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల ఆసుపత్రి లో వైద్య సదుపాయాల కల్పనపై డి సి హెచ్ ఎస్ ఆనంద మూర్తి, సూపరింటెండెంట్లు, మెడికల్ ఆఫీసర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రి లో మౌలిక వసతులు కల్పించి, రోగులకు మెరుగైన సేవలు అందించాలి అని అన్నారు. ప్రతిరోజు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పేషెంట్లు రావడం జరుగుతుందని, వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా వైద్య సేవలు అందించాలని తెలిపారు. తాగునీటి వసతి, ఆక్సిజన్ సరఫరా, జనరేటర్, అదనపు గదులు వంటి సదుపాయాల కొరత లేకుండా పనులు పూర్తి చేయాలని తెలిపారు.

'ఏకలవ్య గురుకుల' సిబ్బందిపై ఎంఎల్ఎ సీరియస్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

మండలంలోని ఏకలవ్య గురుకుల హాస్టల్ సిబ్బందిపై ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం సీరియస్ అయ్యారు. బుధవారం ఉదయం ఆయన పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఎవరైనా వచ్చినపుడే హాస్టల్‌ను శుభ్రం చేస్తున్నారని, అనాధల హాస్టల్లా చూస్తున్నారని విద్యార్థులు చెప్పడంతో ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్‌పై సీరియస్ అయ్యారు. విద్యార్థులు ఆహారం సరిగ్గా లేదని, మరుగుదొడ్లు శుభ్రం చేయడం లేదని, పరిసరాలు చెత్తతో ఉంటున్నాయని వివరించారు. ఇకపై ఇలా జరిగితే సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ సుబ్రమణ్యం, ఎంపిడిఒ త్రివిక్రమరావు, ఎంఇఒ రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, సబ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథనాయుడుతో మాట్లాడి పాఠశాల శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. రోజుమార్చి రోజు మండల విద్యాశాఖాధికారులు తనిఖీ చేసి విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఐటిడిఎ ప్రాజెక్టు డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి ఫోన్ ద్వారా స్పందించారు. కలెక్టర్‌తో మాట్లాడి విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.



ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి అమానుషం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉన్నత హోదాలో ఉన్న దళిత ఉద్యోగి ప్రొఫెసర్ చెంగయ్య మత ప్రచారం చేశాడన్న అభియోగాన్ని మోపి భౌతికంగా దాడి చేయడం అమానుషమైన చర్యని, దాడికి పాల్పడిన భజరంగ్ దళ్ కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని దళిత క్రిస్టియన్ మైనారిటీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి నగర పరిధిలోని అంబేద్కర్ భవన్ లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ అరుల్ అరసు, విశ్రాంత న్యాయమూర్తి గురప్ప మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా మతసామరస్యానికి ప్రతీకగా ఉండే తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రంలో మతాల మధ్య చిచ్చు రేపే ఘటన జరిగిందన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రొఫెసర్ చెంగయ్య తప్పు చేసి ఉంటే ఆధారాలతో వర్సిటీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చెయ్యాలి గాని, ఆయన వ్యక్తిగత చాంబర్ లోకి వెళ్లి బలవంతంగా ఈడ్చుకుంటూ, బూతులు తిడుతూ బయటికి లాక్కొచ్చారని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



విద్యావంతుడుగా పుస్తక పఠనం అలవాటు ఉన్న చెంగయ్య, తాను చదువుకోవడానికి తన ఛాంబర్ లో ఉంచుకున్న పుస్తకాన్ని తీసుకుని మత ప్రచారం చేస్తున్నాడని చెప్పడం దారుణం అన్నారు. ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు రఫీ హిందుస్తానీ మాట్లాడుతూ లౌకికవాదానికి కుల మతాలకు ప్రత్యేకగా ఉన్న తిరుపతిలో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో దళిత సాహిత్య అకాడమీ నాయకులు ధన శేఖర్, బీఎస్పీ నాయకులు వెంకటేష్, పాల్ రాజ్, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

క్యాంపస్‌లో ...ఎస్వీయూలో

విద్యార్థులకు అన్యమత ప్రచారం తరగతులలో బోధిస్తున్నట్లు వచ్చిన ఆరోపణపై చెంగయ్యపై కొందరు బయట వ్యక్తులు దాడి చేయడం హేయమైన చర్యని ఏపీ దళిత కాపు బీసీ సంఘం అధ్యక్షులు సుంగలూరి శివకాపు ఖండించారు. బుధవారం రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడుకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవేళ ఎస్వియూ ఆచార్యుడు అన్యమత ప్రచారం తరగతి గదిలో బోధిస్తుంటే ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా బయట వ్యక్తులు వర్సిటీ క్యాంపస్లో ప్రవేశించి దాడి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే బయట వ్యక్తులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి తిరుపతి ఎస్వీయూనివర్శిటీ ఇంజనీరింగ్ విభాగ ప్రొఫెసర్ సీహెచ్.చెంగయ్యపై భజరంగ్ దళ్ మూకలు దాడి చేయడం హేయమైన చర్యగా క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఫౌండర్ పాస్టర్ సుందర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. ఎవరి మతం వారికి గొప్పదన్నారు. దళితుడైన ప్రొఫెసర్ తన ఇష్టప్రకారం మరో మతంలోకి ప్రవేశించడం తప్పుగా పరిగణించడం తగదన్నారు. దీన్ని తప్పుగా చూపిస్తూ ఆయనపై అకారణంగా దాడి చేయడం భారత రాజ్యాంగంపై దాడి చేయడమే అన్నారు. ప్రభుత్వం స్పందించి చెంగయ్య ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


గూడూరు డిపోలో అక్రమ సస్పెన్షన్ ఎత్తేయాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు ఆర్టీసీ డిపోలో అక్రమ సస్పెన్షన్ ఎత్తేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఈ.శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో ఈ.శివకుమార్ మాట్లాడుతూ గూడూరు డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వహించే క్రమంలో జరిగే ప్రమాదములు, కండక్టర్ల కేసులు పరిష్కరించి న్యాయం చేయుటలో డిపో మేనేజరు యూనియన్ల వారిగా నిర్లక్ష్య పక్షపాతవైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. ఈ మధ్యకాలంలో ప్రమాదములు జరిగినట్లు



అభియోగం ఎదుర్కొన్న డ్రైవర్లకు న్యాయం చేయడంలోనూ, కండక్టర్ల కేసులు పరిష్కరించడంలోనూ సర్క్యులర్ నం. 1/2019 లోబడి చర్యలు తీసుకొనవలసి యుండగా తన ఇష్టానుసారం కొంతమందికి మాత్రమే సర్క్యులర్ అమలుచేసి న్యాయం చేస్తూ, మరి కొంతమందిని ఉద్దేశ పూరితంగా, అన్యాయంగా ఏకపక్షంగా విధులనుండి సస్పెండ్ చేశారన్నారు. ప్రత్యేకించి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సభ్యులకు 1/ 2019 సర్క్యులర్ను అమలుచేయకుండా తన ఇష్టాను సారంగా సస్పెండ్ చేయడం అన్యాయం అని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవతీసుకొని అక్రమ సస్పెన్షన్ రద్దు చేయించి ఉద్యోగులను విధులకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షులు డి.మల్లికార్జున, డిపో అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్.రాము, జి.శ్రీధర్, రీజనల్ నాయకులు కె. శ్రీనివాసులు పాల్గొన్నారు.



'హార్ట్' కేర్...వాసు కార్డియాక్..!

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పేద రోగులకు ఎన్నిది. గా ఆత్మస్థైర్యంతో అతి తక్కువ ఫీజుతో అత్యాధునిక వైద్యాన్ని ప్రజలకు అందిస్తూ వారి నమ్మకాన్ని వాసు కార్డియాక్ కేర్ సొంతం చేసుకుందని ఆ హాస్పిటల్ అధినేత, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వాసు దేవ శెట్టి పేర్కొన్నారు. లీలామహల్ సర్కిల్ వద్దనున్న వాసు కార్డియాక్ కేర్ ఆసుపత్రి వద్ద ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ డాక్టరుగా 22 సంవత్సరాలు సుదీర్ఘ అనుభవంతో, 13 సంవత్సరాల గుండె శస్త్రచికిత్సలలో అనుభవం గడించి, మెరుగైన వైద్యం ప్రజలకు అందుస్తున్నానని తెలిపారు. ఇప్పటి వరకు తాను నిర్వహించిన ఎంజియోగ్రామ్‌లలో ఎవ్వరికి ఎలాంటి ప్రాణాపాయం కలగ లేదన్నారు. ఏంజియోప్లాస్టీ విధానాల్లో (స్టెంట్‌లు వేయడంలో) అతి తక్కువ మరణాలు (1శాతం కన్నా తక్కువ) అని అన్ని సమయాల్లో హామీ ఇవ్వగలనని ధీమా వ్యక్తం చేశారు. లెఫ్ట్ మెయిన్ అండ్ కాంప్లెక్స్ కొరోనరి ఇంటర్వెన్షన్‌పై దక్షిణ కొరియా, సియోల్‌లో ప్రత్యేమైన శిక్షణ గడించినట్లు వెల్లడించారు. గుండెలోని రంధ్రాలు (ఎఎస్‌డి, విఎస్‌డి, పిడిఎ) మూసివేత చికిత్సలు, పేస్‌మేకర్ థెరపీలలో సుదీర్ఘ అనుభవం ఉందన్నారు. స్విమ్స్ డిఎం కార్డియాలజీ ప్రవేశపరీక్షలో స్టేట్ ప్రథమ ర్యాంకు సాధించి, జనరల్ మెడిసిన్‌లో గోల్డ్ మెడల్ పొందానని తెలిపారు. నిష్ణాతమైన ఏకగ్రతతో తను గడించిన అనుభవాన్ని రంగరించి, తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో వాసు



కార్డియాక్ కేర్‌ను స్థాపించామన్నారు. అతి తక్కువ కాలంలో రోగుల మన్ననలను అందుకుని, మహానగరాలలో అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య సేవలను ఆధ్యాత్మిక నగరానికి తీసుకొచ్చి ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నామన్నారు. గుండెపోటును ముందస్తు జాగ్రత్తలతో నివారించవచ్చని పేర్కొన్నారు.

గుండెపోటు లక్షణాలు....ఛాతి మధ్యలో అసౌకర్యంగా కూడిన ఒత్తిడి బరువు ఉన్నట్లు, మెలి పెట్టినట్లు నొప్పి ఉండవచ్చు. ఇలా కొన్ని నిమిషాల పాటే ఉంటుంది. ఛాతినొప్పి, వీపు నొప్పి, కడుపు పై భాగంలో నొప్పి, లోపలివైపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మెదడు నొప్పి, తల తిరగడంతో పాటు చెమటలు పట్టడం లాంటి లక్షణాలు ఉంటే గుండెపోటుకు దారితీస్తుంది. ఈ లక్షణాలు ఉన్న వ్యక్తి వెంటనే దగ్గరలో ఉన్న హృద్రోగ నిపుణులను సంప్రదించి చికిత్స పొందాలి. తప్పకుండా మందులు వాడడం, రక్తంలో కొలెస్ట్రాల్ శాతం తగ్గించుకోవడం, వ్యాయామం చేయడం, మొదలైనవి పాటించాలి. పూర్తి వివరాలకు 0877 2272666 సంప్రదించాలని కోరారు.

హెచ్ఎస్‌సిఆర్‌పి పాత్ర కీలకం హై సెన్సిటివ్ సి - రియాక్టివ్ ప్రోటీన్ (హెచ్ - సిఆర్ పి) హదయ ఆరోగ్యాన్ని అంచనా వేయడంలో కీలకపాత్ర వహిస్తుందని తెలిపారు. హెచ్ ఎస్ సి ఆర్ పి స్థాయిలు అధికంగా ఉంటే రాబోయే 30 సంవత్సరాలలో ప్రధాన హదయ సంబంధిత రోగాలు, స్ట్రోక్, కరోనా హదయ వ్యాధుల ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది అన్నారు. హై సెన్సిటివ్ సిఆర్పి సాధారణ సీఆర్పీ కంటే చాలా సంక్లిష్త స్థాయిని కూడా కొలవగలదన్నారు.

హృదయ వ్యాధుల ప్రమాదం: గుండెకు సంబంధించిన నాళాలలో ఇంఫ్లామేషన్ ఉందా అనే దానిని సూచిస్తుంది. హై సెన్సిటివ్ సి ఆర్ పి స్థాయి ఎక్కువగా ఉంటే గుండెపోటు, టోప్ వంటి ప్రమాదాలు కూడా ఎక్కువగా ఉంటాయన్నారు.

ఆరోగ్య నిర్వహణ: ఈ పరీక్ష ద్వారా వైద్యులు రోగికి అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకొని సూచనలు ఇవ్వగలరు. వ్యాధి తీవ్రతను ముందే అంచనా వేయగలరు.ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, ధూమపానం మానడం వంటి మార్పులు ద్వారా హై ఎస్ -సి ఆర్ పి స్థాయిని తగ్గించడంలో సహాయపడతాయి.

ఆస్పత్రి ప్రత్యేకతలు


- సంపూర్ణ గుండె చికిత్స, ఈసిజి
- ఎకో అండ్ కలర్ చిన్నపిల్లల గుండె స్కానింగ్.
- ట్రెప్ట్ టి అండర్1 వెంటిలేటర్ సదుపాయం
- 24 గంటలు ఇంటెన్సివ్ కేర్ సదుపాయం.

చరిత్రకు సాక్ష్యం నేల కూలనుందా?

చెట్లు పెరిగి శిథిలావస్థకు హథీరాంజీ మఠం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఆ భవనం చారిత్రాత్మకమైనది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామితో పాచిక లాడిన హథిరాం బావాజికి చెందిన మఠం నిర్వహణ గాలిలో దీపంలా మారిపోయింది. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ మఠం తిరుపతి పుర ప్రజలకే కాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న బావాజీ ఆరాధ్యులకు సుపరిచితం. తిరుమల క్షేత్రాన్ని దర్శించుకోవడానికి వచ్చే లంబాడి, బంజారా సామాజిక వర్గానికి చెందినవారు మొదటగా హథీరాం బాబాజీ మఠానికి వచ్చి సేదతీరి, అక్కడే వంటావార్పు చేసుకుని ఇక్కడి నుండి తిరుమల క్షేత్రానికి కాలినడకన వెళ్లేవారు. నేటికీ ఈ సాంప్రదాయం కొనసాగుతూనే ఉంది. తిరుపతి నగర పరిధిలోని పేరొందిన మార్గము గాంధీ రోడ్డులో గల హథిరాంజీ మఠం పరిపాలన భవనం రోడ్డు మార్గం వైపు ఉన్న మఠంపై భాగంలో మొక్కలు పెరిగి భవన రూపాన్ని కళా విహీనంగా మార్చడమే కాకుండా భవన నిర్మాణాన్ని శిథిలావస్థకు చేర్చాయి. చరిత్రకు సాక్షీభూతంగా ఉన్న ఈ భవన శిథిలావస్థపై అధికారులు ఏమాత్రం స్పందించకపోవడంపై నగర ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎంతో విశిష్టత ఉన్న ఈ మఠానికి దేశంలో ఏ మఠానికి లేనంత ఆస్తులు ఉన్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న శ్రీ స్వామి హథిరాంజీ మఠం భవనాన్ని ఇప్పటికైనా అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకోకపోతే చరిత్రకు ఫోటో సాక్ష్యం తప్ప నిజస్వరూపాన్ని దూరం చేసిన వాళ్లు అవుతారు. గతంలో ఇదేవిధంగా మొక్కలు పెరిగి గోడలకు బీటలు వారితే తాత్కాలిక చర్యలను చేసి మమ అనిపించేశారు. ప్రస్తుతం గాంధీ రోడ్డు మార్గం వైపు ఉన్న భవనంపై చెట్లు విపరీతంగా పెరిగాయి. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు భవనం పూర్తిగా నీటితో నాని పోయి ఉంది. ఇప్పటికైనా మఠం అధికారులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.



చెట్లు పెరిగి కూలడానికి సిద్ధంగా శిథిలావస్థలో ఉన్న మఠం కార్యాలయం

టీటీడీ ఆర్థిక కుంభకోణాలపై విచారణ జరపాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమలలో అక్రమ హాకర్ లైసెన్సులు, కాంట్రాక్టర్ల అక్రమాలు, వాటర్ బాటిళ్ళ కుంభకోణంపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరుతూ తిరుపతి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు టీటీడీ పరిపాలన భవనం ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీవారిపై ఉన్న భక్తితో భక్తులు సమర్పించే కానుకలను ఇష్టా రాజ్యాంగ ఖర్చు చేస్తూ దుర్వినియోగ పరచడం దారుణం అన్నారు. భక్తుల సొమ్ముకు జవాబుదారీగా ఉండాల్సిన టీటీడీ అధికార పార్టీ మెప్పుకోసం, వారి నిర్ణయాలను అడ్డు చెప్పక అడిగిందే తడవుగా నిధులు, కాంట్రాక్టులు ఇలా దోచేశారని చిట్టిబాబు ఆరోపించారు. టీటీడీలో జరిగిన ఆర్థిక కుంభకోణాలపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులకు కఠిన శిక్ష వేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాంగాటి గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం టిటిడి ఈవో శ్యామలరావును కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, కంభంపాటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎగ్జామ్స్ సెంటర్ పరిశీలన


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: స్థానిక భాకరాపేట సాయిరాం స్కూల్లో బుధవారం పరాఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ ఎగ్జామ్స్ (నేషనల్ అచీవ్ మెంట్ సర్వే ఎగ్జామ్ -2024) నిర్వహించారు. మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ గోపీనాథ్ బుధవారం ఎగ్జామ్స్ సెంటర్ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎగ్జామ్స్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ స్కూల్ కరస్పాండెంట్ ఎనమల జనార్దన్ రెడ్డి మాట్లాడు తూ మండల స్థాయిలో సాయిరాం స్కూల్ పాఠశాల మాత్రమే ఎంపిక కావడం సంతోషకరం అన్నారు. తమ పాఠశాల రాష్ట్ర స్థాయిలో కాక కేంద్ర స్థాయిలో కూడా గుర్తింపు తెచ్చుకున్నందుకు చాలా సంతోషంగా వుందన్నారు.

చంద్రగిరి: చంద్రగిరి లోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులకు పరాఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ సర్వే -2024 బుధవారం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి-2 కె.భాస్కర్ బాబు నోడల్ ఆఫీసర్ గా వ్యవహరించారు. చంద్రగిరి మండల విద్యాశాఖాధికారి-1, లలిత కుమారి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ గా శరత్,అబ్జర్వర్ గా అనుప్రియ వ్యవహరించారు. ఇందులో పాఠశాల కరస్పాండెంట్ డా.బి.హితేంద్రనాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై పద్మావతి దేవి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు బుధవారం ఉదయం గోవర్ధన గిరిధారియైన శ్రీ కృష్ణుని అలం కారంలో సూర్యప్రభ వాహనం పై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయి ద్యాలు, భక్తుల కోలాటాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిం చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు వాహనసేవ సాగింది. భక్తులు అడుగడుగునా నారికేళం, కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని దర్శించు కున్నారు.


సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న పద్మావతి దేవి

నేడు రథోత్సవం

శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన గురువారం ఉదయం 8 గంటలకు అమ్మవారి రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి అశ్వవాహనంపై అమ్మవారు విహరించనున్నారు. వాహనసేవల్లో తిరుమల పెద్ద జీయంగార్, చిన్న జీయంగార్, ఈవో జె శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఇతర ఉన్నతాధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేలూరు మురళీకృష్ణారెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండ లంలోని శిరసనంబేడులో తిరుపతి జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి తండ్రి జనార్దన్ రెడ్డి కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. ఈ సందర్భంగా పెంచలకోన ఆలయ మాజీ అధ్యక్షులు శ్రీ తానంకి, నానాజీ, దొరవారి సత్రం మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉక్కరయ్యలు మురళీకృష్ణారెడ్డిని కలిసి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం కలిపించారు.


నారాయణమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రోజా సోదరుడు

సర్పంచ్ అత్త మృతికి రోజా సోదరుడు నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రూరల్ మండలం గొల్లపల్లి పంచాయతీ సర్పంచ్ విరిత అత్త, వైసిపి నాయ కులు, గొల్లపల్లి సర్పంచ్ దేవేంద్ర రెడ్డి తల్లి నారాయణమ్మ అకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకు న్న మాజీ మంత్రి సోదరులు వై కుమారస్వామి రెడ్డి పార్టీ నాయకులతో కలిసి బుధవారం గొల్లపల్లి కి వెళ్లి నారాయణమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. దేవేంద్ర రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఇలాంటి విపత్కర సమయంలో ధైర్యంగా ఉండాలని వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండలం వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రైల్వే యూనియన్ గుర్తింపు ఎన్నికలు ప్రశాంతం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్లో రైల్వే కార్మికుల యూనియన్ గుర్తింపు ఎన్నికలు ప్రశాంతంగా జరుగు తున్నా యి. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ మధ్య పోటీ నెలకొంది. ఈ నెల 4, 5 తేదీల్లో ఎన్నికలు కొనసాగ నున్నాయి . 360 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. రెండు యూనియన్ నాయకులు విజయం తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

షాది మహల్‌కు పాలక మండలి ఏర్పాటు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాలి టీ ఎన్జీవో కాలనీలోని ఈద్గా మసీద్ వద్ద మహల్‌కు కొత్త కమిటీని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశంతో నిర్వహించా రు. ఈ మేరకు పాలక మండలి నియామక పత్రాన్ని పాలక మండలి సభ్యులు గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా స్వీకరించారు. సభ్యులు మాట్లాడుతూ ఈ కమిటీ అభివృద్ధి కోసం ఏర్పాటు చేశారన్నారు. సభ్యులు అహర్నిశలు కష్టపడి పని చేస్తామని తెలిపారు. కమిటీని నియమించినందుకు గాలి భానుప్రకాష్‌కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్ మహమ్మద్ గౌస్ , ఎస్ హమీద్ బాషా, ఎదుల్లా హుస్సేన్ , మహమ్మద్ షఫీ , అఫీజా భాను , రఫీ అహ్మద్ శబ్దర్ యూనిస్ నజీర్ షకీల్ పాల్గొన్నారు.


ధృవీకరణ పత్రాన్ని అందుకుంటున్న షాది మహల్‌పాలక మండలి

విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష


విద్యుత్ శాఖాధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ సిబ్బందితో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలలో విద్యుత్ లైన్లు ఇళ్లపై వెళుతున్నాయని కొన్ని గ్రామాలలో లైన్లు ఇబ్బందికరంగా ఉన్నాయని తెలిపారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని తెలిపారు. నియోజకవర్గంలో రైతులు ఇపుడిపుడే వరి నాట్లు వేస్తున్నారు. కొంత మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. రైతుల సాగుకు విద్యుత్ అంతరాయం లేకుండా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ లోక్ అదాలత్ కు విశేష స్పందన

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గం పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి శ్రీసిటీ చెరివి ఏఈ కార్యాలయ సెక్షన్ ప్రాంగణంలో విద్యుత్తు లోక్‌ఆదాలత్ ఛైర్ పర్సన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి అధ్యక్షతన విద్యుత్ లోక్‌అదాలత్ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ వినియోగదారుల నుండి విశేష స్పందన లభించిందని తిరుపతి జిల్లా నాగలాపురం విద్యుత్తు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ పేర్కొన్నారు. పుత్తూరు విద్యుత్తు డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యలకు సంబంధించిన వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై రాత పూర్వకంగా 13 అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

పండుగలా నిర్వహించండి

పేరెంట్స్ సమావేశాల నిర్వహణపై ఆర్‌జెడి ఆదేశం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యు లు చేసేందుకు ఈ నెల 7వ తేదీ నిర్వహించే మెగా పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశాన్ని పండుగ వాతా వరణంలో నిర్వహించి విజయవంతం చేయా లని కడప ప్రాంతీయ సంయుక్త సంచా లకులు శామ్యూల్ అన్నారు. బుధవారం మండలం లోని కట్టకింద వెంకటా పురం గ్రామంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి రికార్డులు పరిశీలించారు. తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రగతి నివేదిక, ఆరోగ్య నివేదికలను అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సూచన లు, సలహాలు తీసుకో వాలన్నారు. విద్యార్థు లు తల్లిదండ్రులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వా మ్యు లయ్యేలా వారికి అవగాహన కల్పించా లన్నారు. విద్యార్థులకు అపార్ ఐడి కార్డులను తల్లిదండ్రుల సమక్షంలో అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అపార్ అప్‌డేషన్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, ఎంఈఓ మార్కండేయ నాయుడు, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌జెడి శామ్యూల్

గుంతల రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధాన రోడ్డు మార్గంలో నాగాలమ్మ ఆలయం వద్ద ఏర్పడ్డ గుంతలకు ఆర్‌అండ్ బీ అధికారులు బుధవారం మరమ్మతులు చేశారు. ఫెంగల్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు రోడ్డులో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గుంతలకు మరమ్మతులు చేయాలంటూ ఆర్‌అండ్‌బి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా వర్షాలు పడ్డ ప్రతిసారీ నాగాలమ్మ ఆలయం వద్ద యధావిధిగా గుంతలు ఏర్పడుతున్నాయి. ఆర్‌అండ్‌బి అధికారులు వాటికి తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టేస్తున్నారు. శాశ్వత మరమ్మతులు చేపడితే ఇబ్బందులు ఉండవని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రక్తదానం సామాజిక బాధ్యత: ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రక్తదానం సామాజిక బాధ్యత అని ఎస్ కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయంతో విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో కళాశాల ప్రిన్సిపాల్ బ్లడ్ డొనేషన్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండటమే కాకుండా రక్తం అవసరమైన వారికి ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను వారితో పాటు రక్తదానం చేసిన అధ్యాపకులు కోటేశ్వరరావు, విజయ మహేష్, వీర కుమార్‌లను అభినందించారు. సుమారు 15 యూనిట్లు రక్తాన్ని విద్యార్థులు దానం చేశారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ బ్లడ్ బ్యాంకు ప్రాంతీయ వైద్యశాల గూడూరు వారు ఎన్ఎస్ఎస్ అండ్ రెడ్ రిబ్బన్ క్లబ్ ప్రతినిధులను అభినందిస్తూ సర్టిఫికెట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి విజయమహేష్, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి పీర కుమార్, అధ్యాపకులు కిరణమై డాక్టర్ ఝాన్సీ, వాణి, లక్ష్మీ హిమబిందు, రవిరాజు, . వెంకటేశ్వర్లు, రమేష్, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న స్వచ్ఛంద సేవకులు

బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయండి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలో రవాణా శాఖ, యువజన క్రీడారంగంలో బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని బంజారా జన్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎన్డీఏ కూటమి నాయకులు మూడే హరి చౌహాన్ నాయక్ కోరారు. బుధవారం అమరావతిలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కార్యాలయంలో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల్లోనూ గిరిజనుల కోసం వారి ఉన్నతి కోసం, అభివృద్ధి కోసం ప్రతి జిల్లాలోనూ గిరిజన భవనం నిర్మించాలని మంత్రికి వివరించారు. రాష్ట్రంలో రవాణా శాఖలో, యువజన క్రీడా శాఖలో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను(పదివేల పోస్టులు) భర్తీ చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే సీఎం దృష్టికి తీసుకెళ్లి, బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. తెలిపారు.

వైసిపి, టిడిపిల ఘర్షణ

- ఫ్లెక్సీల ఏర్పాటే కారణం
- పాకాలలో 144 సెక్షన్

ప్రజాశక్తి -రామచంద్రపురం (పాకాల): పాకాల పట్టణంలో వైసీపీ వారు సినిమా విడుదల సందర్భంగా టీడిపి వారిని రెచ్చగొట్టే విధంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. పోలీసులు కథనం మేరకు..పాకాల పట్టణం లోని రామకృష్ణ డీలక్స్ థియేటర్ లో పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా వైసీపీ నేతల ఫ్లెక్సీలు మాజీ ముఖ్యమంత్రి జగన్, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి లో ఫోటోలతో పాటుగా టీడీపీని రెచ్చగొట్టే విధంగా కొందరు వ్యక్తులతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిని తొలగించాలని టీడీపీ వారు మాట్లాడంతో ముందు సిద్ధం చేసుకున్న కట్లు, ఇనుప రాడ్లతో టీడీపీ శ్రేణులపైకి వైసిపి వారు గొడవకు దిగారు. పోలీసులు ఇరు గ్రూపులను చెదరగొట్టారు. మంచి చేసి మోసపోయిన మాజీ ఎమ్మెల్యే తాలూకా అంటూ వైసీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలే ఘర్షణకు కారణం అని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ముందస్తు వైసిపి వారు ఇలా చేశారని టిడిపి వారు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పాకాల పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ విధించి పోలీసులు పహారకాస్తున్నారు.

కోనేరు చుట్టూ 'నో పార్కింగ్' బోర్డులు

ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని వైష్ణవ కోనేరు చుట్టూ వన్ టౌన్ పోలీసులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. 'ప్రజాశక్తి' దినపత్రికలో బుధవారం 'వైష్ణవ కోనేరు పవిత్రతను కాపాడండి' అనే శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన వన్ టౌన్ సీఐ గోపి వెంటనే కోనేరు పరిసరాల్లో పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించి 'నో పార్కింగ్ బోర్డులు' ఏర్పాటు చేశారు. నిబంధనలను అతిక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.



భూపతీశ్వర ప్రాజెక్టు ప్రధాన కాలువకు గండి

500 ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి

ప్రజాశక్తి - నాగలాపురం

తుపాను ప్రభావం వరద ఉధృతితో మండలంలోని టిపి కోట వద్ద ఉన్న భూపతీశ్వర ప్రాజెక్టు ప్రధాన కాల్వకు గండి పడింది. దీంతో 500 ఎకరాల్లో ఆయకట్టుకు ఈసారి నీరందని పరిస్థితి ఏర్పడిందని రైతులు లబోదిబోమంటున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి కాలువ నిండిందని గంపెడాశతో ఉన్న రైతులకు గండితో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాగలాపురం మండలం టీపి కోట వద్ద ఉన్న భూపతేశ్వర ప్రాజెక్టు నుంచి బీర కుప్పం చెరువుకు వచ్చే వరవ కాలువ కోసం నిర్మించిన ఆక్విడక్ట్ ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా ధ్వంసమై కాల్వకి ఇరువైపులా ఉన్న కాంక్రీట్ గోడలతో పాటు ఆక్విడెక్ట్ పూర్తిగా ధ్వంసమై కాలువలో కూరుకుపోవడంతో నీరు దిగువకు దాని పరిస్థితి ఏర్పడింది. దీంతో బీర కుప్పం చెరువుకు రావలసిన నీరు మొత్తం రాళ్లవాగులో ప్రవహించి సముద్రంలో కలిసి పోతుంది. పింగల్ తుపాన్ ప్రభావం తో ప్రాజెక్టు నిండుకుండలా కళకళ లాడుతున్న దిగువ ఆయు కట్టు చెరువులకు నీరు వచ్చే మార్గం లేదు. దీంతో ఆయకట్టు పరిధిలో సుమారు 500 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులకు ఇప్పటినుంచి కష్టాలు మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సంబంధింత అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి ప్రాజెక్టు పరిధిలోని చెరువులకు సాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని రైతాంగం కోరుతోంది.



నరాల వ్యాధిపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సంఘమిత్ర



ప్రజాశక్తి -కోట : నరాల వ్యాధులపై ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సంఘమిత్ర అన్నారు. బుధవారం కోట మండలంలోని ఎన్సీఆర్ నగర్ లో ఉన్న జనతా క్లినిక్ ఆసుపత్రికి న్యూరాలజిస్ట్ డాక్టర్ సంఘమిత్ర రావడం జరిగింది. ఈ సందర్భంగా కోట వాకాడు చిట్టమూరు మండలాల నుండి పలువురు నరాలు వ్యాధితో బాధపడుతున్నవారు ఆసుపత్రికి వచ్చి చికిత్స లు పొంది పలు సూచనలు, సలహాలను తీసుకున్నారు. అనంతరం నెల్లూరు కిమ్స్ ఆసుపత్రి నుండి విచ్చేసిన న్యూరాలజిస్ట్ డాక్టర్ సంఘమిత్ర నరాల బలహీనత నివారణ చర్యలపై రోగులతో మాట్లాడుతూ వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలను తీసుకోవడం రక్తనాళాలకు చాలా మంచివని, ఇందులో విటమిన్ బి,సి,ఇ, మెగ్నీషియం, రాగి, ఫోలేట్, కాల్షియం ఆకుపచ్చ కూరగాయలలో కనిపిస్తాయని ఇవి నరాల బలహీనతను దరిచేరకుండా చేస్తుందన్నారు. ఆకుకూరల్లో ఉండే ఫైటోన్యూట్రియెంట్లు రక్త ప్రసరణను మరింతగా మెరుగుపరుస్తాయని తెలిపారు.ఆరంజ్,లెమన్, జామ,బెర్రీలు,పీచెస్,చెర్రీస్, ఎర్ర ద్రాక్ష, నారింజ, పుచ్చకాయ వంటి పండ్లలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయన్నారు. ఇవి నరాలు దెబ్బతినకుండా కాపాడడమే కాక నరాల వాపు, నరాల నొప్పిని తగ్గించడంలోనూ సహాయపడుతాయని చెప్పారు. నరాలు, నాడీ వ్యవస్థ శక్తివంతంగా, ఉత్తేజంగా పని చేయాలంటే మెగ్నీషియం ఉన్న ఆహారాలు(డార్క్ చాకెట్లు, బాదం, జీడిపప్పు, అవకాడో, ఆరటి పండ్లు, పాలకూర, బొప్పాయి అవకాడో, టోఫు, పాలకూర, (క్వినోవా)ఎక్కువగా తీసుకోవాలన్నారు. విశ్రాంతి, మంచి నిద్ర అవసరమని నిద్ర లేకపోవడం వల్ల మానసిక ఉద్దీపనలు, జ్ఞాపకశక్తి సమస్యలు,నిరాశ,ఒత్తిడి వంటివి పెరిగి నరాలు దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. శారీరక శ్రమ,వ్యాయామం వల్ల నరాల పనితీరు మెరుగుపడి బలహీనతకు గురికాకుండా ఉంటాయన్నారు. నాడీ వ్యవస్థ శక్తిమంతంగా ఉండేందుకు విటమిన్-డి చాలా అవసరమని, దీని కోసం ప్రతి రోజూ తగినంత సేపు ఎండలో తప్పనిసరిగా నడవాలన్నారు. నరాలను ఆరోగ్యంగా కాపాడుకోవాలంటే ఆహారంలో సోడియం స్థాయిని అదుపులో ఉంచుకోవడం కూడా చాలా ముఖ్యం. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్‌లు ఎక్కువగా ఉండే చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల కూడా నరాలకు బలం చేకూరుతుందన్నారు. జంక్ ఫుడ్,ఫాస్ట్ ఫుడ్ లకు దూరంగా ఉండడమే కాక అధికంగా నూనెతో తయారుచేసిన ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోకపోవడం మంచిదన్నారు.

పంటకు బీమా చేయండి..రక్షణ పొందండి..

వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కెవిబిపురం మండలంలోని 39 పంచాయతీల్లో పంట బీమాను నమోదు చేసుకుని రక్షణ పొందాలని మండల వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని ఎంఏ రాజులు కండ్రిగ, కేవిబిపురం, కళత్తూరు, ఆరె గ్రామంలో పంట బీమాపై రైతులకు బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ 2024-25 సీజన్‌లో రైతులు పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రతి రైతు పంట బీమా చేసుకోవాలన్నారు. పంట బీమా ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. రైతులు పంటలకు ఈ- క్రాప్ లో నమోదు చేసుకొని నిర్ణీత గడువులోపు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులు ని, తిరుపతి జిల్లాలో వేరుశనగకి ఒక ఎకరాకు రూ.480, వరికి రూ.630 చెల్లించి ప్రీమియం రసీదు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడు విజయ్ భాస్కర్ మృతి



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండ లం లోని కనమలంబేడు గ్రామా నికి చెందిన వైసిపి నాయకుడు, మాజీ గ్రామ సర్పంచ్ చింతపూ డి విజయ్ భాస్కర్ అనారోగ్యంతో మంగళవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆయన మృతి వార్త విని వైసిపి నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. చింతపూడి విజయభాస్కర్‌కు మండల వైసిపి కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, చెరువు మరమ్మతులు, అంబేద్కర్ విగ్రహ నిర్మాణం, శ్మశానం పరిరక్షణ వంటి పనులు రాజకీయాలకు అతీతంగా చేశారని ప్రశంసించారు. వైసిపి నాయకులతో కలిసి గ్రామానికి పోరాడి నిరంతరం విద్యుత్ సరఫరాను సాధించారన్నారు. వారి కుటుంబ సభ్యు లకు కనమనంబేడు గ్రామం రుణపడి ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. వారి భౌతిక కాయానికి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబానికి పార్టీ తరపున ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

ఉచిత విద్యుత్ హామీపై చేనేతల హర్షం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే చేనేతరకు ఉచిత విద్యుత్తు అందిస్తామని హామీ ఇవ్వడం, అందుకోసం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం అని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డి బాబు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఎస్మా ప్రయోగంపై సిఐటియు ఖండన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : 104 కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరిం చకపో గా, వైద్య ఆరోగ్య శాఖ వారిపై ఎస్మా ప్రయోగించడాన్ని సిఐటియు ఓ ప్రకటనలో ఖండించింది. తమ సమస్యల ను పరిష్కరించాలని 104 ఉద్యోగులు తలపెట్టిన ఆందోళ న లకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందిం చి 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులతో చర్చించి సమస్యలు పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : డ్వామా పీడీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ఉపాధి హామీ పథకం కింద పనులు నత్తన డకగా సాగుతున్నాయని, వాటిని వేగవంతంగా జరిగేలా ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేయా లని, విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తిరుపతి జిల్లా డ్వామా పిడి శ్రీనివాస్ ప్రసాద్ హెచ్చరిం చారు. గూడూరు పట్టణం లోని ఎంపీడీవో కార్యాల యంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో పీడీ సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా జరుగుతున్న పను లను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భం గా పి. డి శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడు తూ ఉపాధి హామీ పథకం కింద చిన్న చిన్న పనులు కూడా నెలల తరబడి జరు గుతు న్నాయని, వాటిని వేగవంతం చేయాలని ఆదేశిం చారు.

శాస్త్రీయ ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలి: ఎంఈఓ

ప్రజాశక్తి -చంద్రగిరి: విద్యార్థులు శాస్త్రీయ ప్రయోగాలపై ఎన్ఎక్స్ కార్నర్ ల్యాబ్ సద్వి నియోగం చేసుకొని శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించు కోవడానికి ఉపయోగపడు తుందని ఎంఈవో లలిత కుమారి అన్నారు. స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీ పద్మావతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల చంద్రగిరిలో ఎన్ఎక్స్ కార్నర్ ల్యాబ్‌ను రిబ్బన్ కత్తిరించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో లలిత కుమారి మాట్లాడుతూ చంద్రగిరి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఎన్ఎక్స్ కార్నర్ ల్యాబ్‌ను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని, రెండు సంవత్సరాల నుండి షెల్ ఇండియా సహకారంతో స్మైల్ ఫౌండేషన్ తిరుపతి జిల్లాలోని 38 పాఠశాలలకి ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన ప్రాపంచిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పిస్తూ స్టెమ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని వివరించారు. దీంతో విద్యార్థులకి సైన్స్ ప్రాజెక్ట్‌పై అవగాహన పెరిగి నూతన ఆలోచనా విధానాలతో కొత్తగా ప్రాజెక్ట్ తయారు చేస్తూ భవిష్యత్ తరాలకి అవసరమైన సదుపాయలను ఎలా అందించాలో తెలుసుకోవచ్చుని పేర్కొన్నారు. కొత్తగా ఒక్కొక్క పాఠశాలకి రూ.2 లక్షల విలువ చేసే స్మార్ట్ టివి, లాప్ టాప్, ఇన్వెర్టర్, సైన్స్ ప్రాజెక్ట్ మెటీరియల్, కార్నర్ పెయింటింగ్ లను అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎక్స్ కార్నర్ ల్యాబ్ తిరుపతి జిల్లాలోని 10 పాఠశాలల్లో ఏర్పాటు చేశామని హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ షెల్, స్మైల్ ఫౌండేషన్ వారు ఇలాంటి మరెన్నో సహకారాలు తమ పాఠశాల విద్యార్థులకు అందించాలని కోరుతూ వారికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధి లోకేశ్వరి, రఫీ, పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాఠశాల కార్యనిర్వహణ కమిటీ సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు, స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


శాస్త్రీయ ప్రయోగశాలను ప్రారంభిస్తున్న ఎం ఈవో కుమారి

భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు: తహశీల్దారు

ప్రజాశక్తి - కోట: అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించ డానికి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని కోట తహశీల్దారు కటారి జే జే రావు అన్నారు. బుధవారం కోట మండలంలోని స్థానిక తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్,మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ కార్యదర్శులతో రెవెన్యూ సదస్సులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు కే.జే జే రావు మాట్లాడుతూ రాష్ట్రంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అందులో భాగంగానే డిసెంబర్ 6 నుంచి 2025 జనవరి 8 వరకూ వీటిని నిర్వహించను న్నారన్నారు. గ్రామ స్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి, 22 ఎ, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులను సర్కార్ స్వీకరించనుందని తెలిపారు. ప్రజల నుంచి పిటిషన్లు తీసుకోవడంతో పాటు ఆర్టీజీఎస్ వెబ్ పోర్టల్ ద్వారానూ దరఖాస్తులు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఈ నెల 5 నుంచి గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను ప్రకటించాలని పేర్కొంది. సదస్సు నిర్వహణకు రెండు రోజుల ముందే సదరు గ్రామానికి సమాచారం వీఆర్వోల ఆధ్వర్యంలో వి ఆర్ ఎ ల చే టామ్ టామ్ కొట్టి వారి గ్రామాల్లో ప్రచారం చేయాలని తహశీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్వోఆర్,అడంగల్, పహాణీ,ప్రభుత్వ భూముల రిజిస్టర్ లాంటి సమాచారాన్ని సదస్సుకు ముందే సిద్ధం చేసుకోవాలని పలు సూచనలు సలహాలను రెవెన్యూ సిబ్బందికి తెలిపారు. ఈ మేరకు ఆరో తేదీ మద్దాలి, ఏడవ తేదీ గూడలి,పదో తేది చిట్టేడు,11 వ తేది రుద్రవరం,12వ తేది కేశవరం,13వ తేది చెందోడు, 17వ తేదీ కొత్తపాలెం,18వ తేది వంజివాక,19వ తేది అల్లంపాడు,20వ తేది పుచ్చలపల్లి,21వ తేది సిద్దవరం,24 వ తేది కర్లపూడి,26వ తేది కొత్తపట్నం,27వ తేది ఇల్లకూరుపాడు, 28వ తేది కోట వన్ సచివాలయం,31వ తేది ఉత్తమ నెల్లూరు,జనవరి రెండో తేదీ లక్ష్మక్క కండ్రిగ, మూడవ తేది నెల్లూరుపల్లి, నాలుగవ తేదీ తిన్నెలపూడి గ్రామాల్లో వారీగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అజంతుల్లా ఖాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధులత, మండల సర్వేయర్ గోపిరెడ్డి, తదితర గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.





హోటళ్లలో తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్ ఆదేశాల మేరకు.. పట్టణ పరిధిలోని హోటల్లో ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు నిల్వ ఆహార పదార్థాలు అపరిశుభ్రత నిర్వహణ కలిగిన హోటళ్లను బుధవారం పురపాలక సంఘం అధికారి శ్రీనివాస్ బాబు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌ఛార్జ్ మునుస్వామి. కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లియో రెస్టారెంట్ 800, శ్రీ లక్ష్మి హోటల్ 200. అన్నపూర్ణ హోటల్ 500, రమజాన్ 1000, మా రెస్టారెంట్ 500, కేక్ డాట్ కాం. 500, జ్యోతి మెస్ మొత్తం 3,200 కేజీలు నిల్వ వుంచిన పదార్థాలను తనిఖీ చేసి హోటల్ యజమానులకు జరిమానా విధించారు. ఈ దాడుల్లో సచివాలయ కార్యదర్శులు. పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల నిర్వహణను ఉపకులపతి ఆచార్య అప్పారావు స్థానికంగా తిరుపతిలోని గాయత్రి, ఆర్ సి రెడ్డి కళాశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ పరీక్షలను వర్సిటీ పరీక్షల డీన్ ఆచార్య కిషోర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ మూడే ధామ్ల నాయక్ పర్యవేక్షిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 62 పరీక్ష కేంద్రాలలో 12 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 25 వేల మంది విద్యార్థులు రాసే వారి సంఖ్య గత కొంతకాలంగా క్రమంగా తగ్గుతూ 12 వేలకు చేరుకుందని వారు తెలిపారు. తద్వారా అనేక సెంటర్లలో నిర్వహించాల్సిన పరీక్షను సంఖ్యాబలం తగ్గడంతో 62 సెంటర్లకు పరిమితమైందని వారన్నారు. పరీక్షలు పరిశుభ్రమైన, స్వచ్ఛమైన వాతావరణంలో నిర్వహించాలని, ఎటువంటి చీటీలకు, కాపీరైట్లకు తావు ఇవ్వకుండా సమర్థవంతంగా నిర్వహించాలని కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యాలకు సూచించారు.



అంతర్జాతీయ చెస్‌లో అన్నదమ్ములకు స్థానం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి కి చెందిన క్రీడాకారులు డి.యోగ్నదీప్, డి.సాత్విక్ కృష్ణ లు తమ ప్రతిభను కనపరచి చదరంగం పోటీల్లో అంతర్జాతీయ స్థాయిని గడించారు. డిసెంబర్ ఒకటవ తేదీన అంతర్జాతీయ ఫిడే సంస్థ, అఖిల భారత చదరంగం సమాఖ్య సమైక్యంగా విడుదల చేసిన ఫిడే రాపిడ్ రేటింగ్ జాబితాలో యోగ్నదీప్ 1,480, డి.సాత్విక్ కృష్ణ 1,432 రేటింగ్ లు సాధించారు.ఈ ఇద్దరినీ కోచ్ ఆనంద మెహన్ పలువురు అభినందించారు. వారిరువురూ ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

మైనింగ్ అక్రమాలపై చర్యలు చేపట్టాలి

- కాంగ్రెస్ నాయకులు పంటా శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గత వైసిపి ప్రభుత్వంలో సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ ద్వారా వేల కోట్ల రూపాయలు దోచుకున్న వారికి నేడు టిడిపి ప్రభుత్వం మైనింగ్ అనుమతులు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోందని మైనింగ్ అక్రమాలకు పాల్పడిన వారిపై చట్ట పర చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. గూడూరు కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ ద్వారా వేల కోట్ల రూపాయలు దోచుకుతిన్నారని పాదయాత్రలో లోకేష్ పర్యటిస్తూ మైనింగ్ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ టిడిపి ప్రభుత్వంలో ఆనాడు అక్రమ మైనింగ్ చేసిన వారికే మళ్లీ మైనింగ్ అనుమ తులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని దీన్ని అనుమతించవద్దని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సర్వేపల్లి ఇన్‌ఛార్జి పూల చంద్రశేఖర్, రావూరి బ్రహ్మయ్య , రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి

అంగవైకల్యం శరీరానికే.. మనస్సుకు కాదు: ఎంపిడివో

ప్రజాశక్తి -సత్యవేడు : అంగవైకల్యం శరీర అవయ వాలకే కానీ మనస్సుకు కాదని సమాజాభివృద్ధిలో అంగవైకల్యం ఉన్న వారిని అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి ప్రోత్సహించడమే అందరి కర్తవ్యం అని తిరుపతి జిల్లా సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ రవి అధ్యక్షతన అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభా వంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ అంగవికలాంగులను ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యతే కాదు.. సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వైకల్యం శరీర అవయ వాలకే కానీ మనసుకు కాదని ప్రత్యేక ప్రతిభా వంతులు తమకున్న ప్రధాన బలమైన మేధో శక్తి, దృఢ సంకల్పంతో ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో విద్యను అభ్యసించి అత్యున్నత స్థాయికి చేరుకుని సమాజంలో తమ శక్తిని చాటాలని పేర్కొ న్నారు. 1992 డిసెంబర్ 16వ తేదీన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ప్రతి సంవత్సరం డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం జరపాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. వైకల్యం ఉన్న వ్యక్తుల హక్కులను ప్రోత్సహించడానికే వికలాంగుల దినోత్సవం జరుపుకుంటున్నట్టు చెప్పారు. ఇందుకు అనుగుణం గా వికలాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమా లను అమలు చేస్తున్నట్టు గుర్తు చేశారు. వైకల్య శాతం 40 శాతం ఉంటే సామాజిక భద్రత పింఛను మంజూరు అవుతుందన్నారు. ఎంఈఓ రవి మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రభుత్వం ప్రత్యేకంగా భవితను ఏర్పాటు చేసింది అన్నారు. ఇదేగాక సాధారణ విద్యార్థులతో పాటు ప్రత్యేక ప్రతిభావంతులను స్కూల్లో అడ్మిట్ చేయడం వల్ల వారికి కూడా విద్యాబోధన కొనసాగు తుందన్నారు. దీంతోపాటు శారీరక అంగవైకల్యం ఉన్నవారికి ప్రతి సోమవారం వైద్యుల ద్వారా ఫిజియో థెరపీ చికిత్స అందిస్తున్నట్టు ఆయన చెప్పారు. మండలంలో 120 మంది ప్రత్యేక ప్రతిభావంతులు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. స్కూల్ నుంచి ఇంటికి రాగానే వికలాంగుల బాగోగులను చూసుకునే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పలువురు ప్రత్యేక ప్రతిభావంతులకు ఎంపీడీవో చంద్రశేఖర్ స్థానిక ఎంఈఓ రవితో కలిసి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ2 ఉష, ఐఈఆర్టీలు దివ్యకుమారి, వెంకటరత్నం పాల్గొన్నారు.

పెళ్లికానుక పంపిణీ

దాతృత్వాన్ని చాటుకున్న దొడ్ల కరుణాకరరెడ్డి



ప్రజాశక్తి -రామచంద్రపురం: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామపంచాయతీ ఉప్పరపల్లి కి చెందిన టిడిపి నాయకుడు ముని భాస్కర్ కుమార్తె స్మృతి వివాహానికి తుమ్మలగుంట చెందిన టిడిపి నాయకులు దొడ్ల కరుణాకర్ రెడ్డి బుధవారం రూ. 25వేల నగదు, వస్త్రాలు, పెళ్లికానుకను అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. చిత్తూరు జిల్లా టిడిపి ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ముని భాస్కర్ పార్టీకి చేసిన సేవలు కొనియాడుతూ ఇలాంటి వ్యక్తిని కోల్పోవడం పార్టీకి తీరని లోటని, ముని భాస్కర్ కుటుంబానికి ఏ ఆపద వచ్చినా తామంతా వారి కుటుంబ సభ్యులకు తోడుంటామని దొడ్ల కరుణాకర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పార్లపల్లి భాను కుమార్ రెడ్డి, శేఖర్, నవీన్ రాయల్, అయ్యప్ప, హరి, ఉమాపతి, ముఖేష్ రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఎస్వీయూ ఆర్థిక శాస్త్ర విద్యార్థులు



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలో దాదాపు ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా నిరంతర వర్షాలతో తిరుపతి మొత్తం జడివానతో అతలాకుతలం అవుతున్న వేళ వర్సిటీలోని చాలా భవనాలు వర్షపు నీరును ఉరుస్తున్నాయి. వర్సిటీ క్యాంపస్ లో దాదాపుగా అన్ని భవనాలలో వర్షపు నీటి నీళ్ల నిలువ ఉండడం ద్వారా భవనాలన్నీ గోడలు నీటిని ఉరుస్తున్నాయి. దీన్ని గమనించిన ఎస్వీయూ ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య సునీత ఆచార్య రాధికలు విద్యార్థులు, పరిశోధకులు, అకడమిక్ కన్సల్టెంట్లు లకు ప్రకాశం భవనం పైన పరిశుభ్రం చేయాలని సూచించారు. సామాజిక సేవలో భాగంగా విద్యార్థులు, పరిశోధకులు భవనం పైకి ఎక్కి అక్కడ నిల్వ ఉన్న నీటిని పూర్తిస్థాయిలో తొలగించి ఆ ప్రాంతాలను మొత్తం పరిశుభ్రం చేశారు. ఎక్కువగా వురుస్తున్న నీరు కొంత మేరకు తగ్గిపోయాయి. ఈ కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ గొంది ప్రతాప్ నాయుడు, పరిశోధకులు ఉసిరికాయల అశోక్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ చేపట్టిన బాల్ వివాహ ముక్త భారత్ క్యాంపెయిన్ లో భాగంగా తిరుపతి రూరల్ మండలంలోని మిట్టమీద కండ్రిగ గ్రామంలో మహిళా అధ్యయన విభాగం, కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహ దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన విభాగాధిపతి డా. నీరజ మాట్లాడుతూ తల్లిదండ్రులు తీసుకునే నిర్ణయాలపైన పిల్లల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, పరిణతి లేని వయసులో వివాహం చేయడం వల్ల బాల్యాన్ని కోల్పోతారని, ఆరోగ్య సమస్యలతో పాటు, గృహింసకు, లైంగిక వేధింపులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కోరారు. బాల్యవివాహాలను అడ్డుకొనడంలో తమవంతు కృషి చేస్తామని, తమ దృష్టికి వచ్చిన సంఘటనలను సంబంధిత అధికారులకు చెరవేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ నాగేశ్వర్ రావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ రమేష్, మహిళా అధ్యయన కేంద్ర ప్రొఫెషనల్ అసిస్టెంట్ డా.సుచరిత, సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లక్ష్యంతో పనిచేయండి

డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

ప్రజాశక్తి-రామచంద్రపురం: మండల రైతులు ప్రకృతి వ్యవసాయ పంటలు సాగు చేసే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పని చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు టిఎన్ శోభన్ బాబు పేర్కొన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో(మండల మహిళా సమాఖ్య) గ్రామ సమాఖ్య సభ్యులు, బుక్ కీపర్లు, మండల మహిళా సమాఖ్య పాలక సభ్యులకు రెండు రోజుల శిక్షణను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను ఉపయోగించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే ఆహార ధాన్యాలు, కూరగాయలను భుజించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యమాన్ని మహిళా సంఘాల ద్వారా ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని ముందు కు తీసుకెళుతోందన్నారు. డీపీఎం షణ్ముగం మాట్లా డు తూ గ్రామాలలో రైతు లు ప్రకృతి వ్యవ సాయం సాగు చేసేందుకు కృషి చేయా లన్నారు. ఈ రెండు రోజుల శిక్షణ ఎంతో ఉపయోగ పడు తుందని సద్వినియోగం చేసుకుని పూర్తి ఫలితాలు సాధిం చా లన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆ గ్రామంలోని సభ్యులందరూ వినియోగించుకునే ఏర్పాట్లు చేస్తామన్నారు. లోకల్ మార్కెటింగ్‌ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పి భానుమర్తి, ఏటీఎం గురుమూర్తి, బిపిఎం దుర్వాసులు నాయుడు, మోడల్ టియల్ విమల, మధు, నీలమ్మ, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా గ్రా మీనాభివృద్ధి పథక సంచాలకులు శోభన్‌బాబు